సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం, 11, అక్టోబర్, 2023



క్షణికావేశం.. కారాదు శాపం.!
కొందరు క్షణికావేశంతో ప్రాణాలు తీసుకుంటున్నారు. అయితే సమస్యకు అది పరిష్కారం కాదని, జీవించి సాధించాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు పేర్కొంటున్నారు. -10లో



మహిమ గల కమండలం పేరుతో టోకరా
మహిమ గల కమండలమని నమ్మించి ఓ స్వామీజీ వద్ద రూ.1.5 లక్షలు వసూలు చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.100	రూ.132
రెండోరకం	రూ.66	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 201 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	520	521
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 228.740 కిలోలు



న్యూస్‌రీల్

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

వైవీయూ: ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న జోన్-4 పరిధిలోని టీజీటీలకు పీజీటీలుగా పదోన్నతి కల్పించేందుకు తుది సీనియారిటీ జాబితాను డీఈఓ కార్యాలయాల్లో ఉంచినట్లు కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎం.వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. టీజీటీలు సర్వీసు రిజిష్టర్లు, ఒరిజినల్ సర్టిఫికెట్స్, మూడేళ్ల యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్‌తో కడప నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఈ నెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

దూర విద్యా విధానంలో సర్టిఫికెట్ కోర్సులు

వైవీయూ: గుంటూరులోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సార్వత్రిక, దూరవిద్యా విధానంలో సర్టిఫికెట్ కోర్సులు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడప కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎ.వీరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 20వ తేదీ నుంచి నాలుగు ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల (చిరుదాన్యాలు, జీవన ఎరువులు, పట్టు పురుగుల పెంపకం, సేంద్రియ ఎరువులు, వర్మి కంపోస్టు తయారీ)ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ. 1500/-ఫీజు చెల్లించి నవంబర్ 15 లోపు చేరవచ్చని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న అధికారి చంద్రనాయక్

రాయచోటి టౌన్: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్ర నాయక్ తెలిపారు. మంగళవారం రాయచోటిలోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రబీలో ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా రైతులకు సూచించాలన్నారు. పెట్టుబడి తక్కువ, రాబడి ఎక్కువ ఉంటుందని చెప్పాలన్నారు. ఈ పంటల ద్వారా ఆరోగ్యంతోపాటు పర్యావరణ సమతుల్యత లభిస్తుందని వివరించారు. రైతు సాధికార సంస్థ డిమాటిక్ లీడ్ జేబీఆర్ చక్రవర్తి, డీపీఎం రామకృష్ణరాజు, నాచురల్ ఫార్మింగ్ అసోసియేట్‌లు, డీపీఎంలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

రాయచోటి టౌన్: రాయచోటిలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో ఈ సెంటర్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వనరులు, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని, అందుకు తగిన విధంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడు నెలలు శిక్షణ ఇచ్చి, స్థానికంగా ఉన్న పరిశ్రమలు, ఇతర రాష్ట్రాలలో ఉన్న పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పించనున్నట్లు వివరించారు. ఈనెల 12వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లో చేరేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ ఆపై చదివిన విద్యార్థులు (స్త్రీ /పురుషులు) అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం గణేష్ : 9550104260/ సుజాత 9177143181లకు ఫోన్ చేయాలని వివరించారు.

ప్రజలందరికీ ఆరోగ్య రక్ష

- మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం
- జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- ఇప్పటి వరకు 50,742 మందికి వైద్య సేవలు



రాయిచోటి మండలం యాండపల్లెలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు



రాయచోటిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

సాక్షి రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం అనారోగ్య బాధితులందరికీ అత్యుత్తమ వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎక్కడికక్కడ పలు రకాల పరీక్షలు మొదలుకొని ఆపరేషన్ల వరకు అన్ని చర్యలు చేపడుతోంది. వ్యాధి ఏదైనా నయం చేయడమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తోంది. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాలకు వైద్య బృందాలు పరుగులు తీస్తున్నాయి. ముందుగా ఏఎన్‌ఎం, వలంటీర్‌తోపాటు మరి కొంత మంది సిబ్బంది ప్రత్యేక పరీక్షలు నిర్వహించగా.. అనంతరం శిబిరాల ద్వారా వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నారు. పెద్ద వ్యాధులు, ఆపరేషన్లకు సంబంధించిన బాధితులను నేరుగా పెద్దాస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ఇందుకోసం వైఎస్ జగన్ సర్కార్ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వైద్య బృందం ప్రతి ఇంటి తలుపు తట్టేలా... ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న మహోన్నత ఆశయంతో వడివడిగా అడుగులు వేస్తోంది.

151 శిబిరాల ద్వారా..

జిల్లాలో సెప్టెంబరు మూడవ వారం నుంచి తొలుత సర్వేకు శ్రీకారం చుట్టిన యంత్రాంగం తర్వాత శిబిరాల నిర్వహణ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 151 జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించారు.

- మహిళలు, పండుటాకులు, చిన్నారులు, వృద్ధులు, యువకులు ఇలా అందరూ కలుపుకొని సుమారు 50,742 మంది పరీక్షలు చేయించుకున్నారు. అందులో మహిళలు 27,366, పురుషులు 23,376 వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 45,242 మందికి చికిత్స అనంతరం వారి వ్యాధులను బట్టి మందులను అందజేశారు. ఆరోగ్య శిబిరాల్లో అన్ని రకాల వ్యాధులకు సంబంధించి ఓపీల ద్వారా పరిశీలన జరుపుతున్నారు. మరో పక్క కంటికి సంబంధించి పరీక్షలు నిర్వహించి 2993 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఇంకో వైపు పెద్దాస్పత్రుల్లో 563 మందికి ఆపరేషన్లు నిర్వహించాలని నిర్ణయించారు.
- జిల్లాలో అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక వైద్యానికి ఉపక్రమించింది. ప్రధానంగా జిల్లాలో ప్రత్యేక శిబిరాల ద్వారా పెద్ద జబ్బులకు సంబంధించిన వారికి ఇతర పెద్దాస్పత్రులలో చికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడికక్కడా గుర్తింపు ప్రక్రియ ముగిసిన తర్వాత వారిని పెద్దాస్పత్రులకు తరలించనున్నారు. అక్కడ అత్యుత్తమ వైద్యం ఉచితంగా అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.

శిబిరాల ద్వారా వైద్య పరీక్షలు



జిల్లాలో ఎక్కడికక్కడ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నాం. అక్కడికి వచ్చిన వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను ఉచితంగా అందజేస్తున్నాం. వ్యాధి ఏ స్థాయిలో ఉన్నా నయం చేయడానికి వైద్యులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే 150కి పైగా వైద్య శిబిరాలను పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించాం.

– డాక్టర్ కొండయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

అత్యుత్తమ వైద్య సేవలు



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ముందుగా సర్వే నిర్వహించి తదనంతరం వ్యాధిగ్రస్తులను సమీప ప్రాంతంలోని కేంద్రానికి పిలిపించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. అనారోగ్య బాధితులకు అత్యుత్తమ వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఆరోగ్య శిబిరాలకు వ్యాధిగ్రస్తులు అధికంగా వస్తున్నారు. అక్కడికక్కడే వివిధ పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులను కూడా అందజేస్తున్నాం. ఎక్కడా కూడా చిన్నపాటి లోటుపాట్లు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోంది.

– పీఎస్ గిరీషా, కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి

రాయచోటి: పరిశ్రమలు స్థాపించడం ద్వారానే జిల్లా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 16వ జిల్లా పరిశ్రమల ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పరిశ్రమలు స్థాపించేందుకు అధికారులు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని తెలిపారు. ఇప్పటి వరకు 1482 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 1428కు అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గడువులోపల పరిష్కరించాల్సిన అర్జీలు ఏడు ఉన్నాయని, వీటిని వెంటనే క్లియర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి అనిల్‌కుమార్, డీపీఓ ధనలక్ష్మీ, ఎస్‌పీడీసీఎల్ ఏఈ నరేంద్రనాథ్, వాణిజ్య పన్నుల శాఖ అధికారి నారాయణరెడ్డి, ఏపీఎస్ఎఫ్‌సీ అధికారి నాగభూషణం, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి

జిల్లాలోని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఎన్‌హెచ్ 71 భూ సేకరణ, పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఎన్‌హెచ్ 71 భూ సేకరణ పరిహారం చెల్లింపు అంశాలపై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓ మురళీ, హెచ్ఎంఎస్ యూనిట్-2 ఎస్‌డీసీ గోపాలకృష్ణ, సంబంధిత తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ నిర్మాణానికి ఏర్పాట్లు ముమ్మరం

అధికారులతో కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమీక్ష



మ్యాప్‌లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాయచోటి కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఆర్అండ్‌బీ అధికారులు, ఐసీసీ కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓ బంగ్లాల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. ఆ భవనాల ఆకృతులు, ల్యాండ్ స్కేపింగ్, రహదారుల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన తదితరాలకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కలెక్టరేట్ నిర్మాణానికి త్వరితగతిన ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ బంగ్లా, క్యాంపు ఆఫీసు, జేసీ బంగ్లాల నిర్మాణాలకు ఈ నెల 16న భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. వాటిని ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఆరు నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అంతకుముందు ఆర్అండ్‌బీ అధికారులు, ఐసీసీ కన్సల్టెన్సీ ప్రతినిధులు.. వాటిని నిర్మించనున్న స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ సహదేవ రెడ్డి, డీఈ వెంకటసుబ్బయ్య, ఏఈ గిరీశ్వరరావు, ఐసీసీ కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు సన్నాహాలు

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 11 నుంచి జనవరి 15 వరకు నిర్వహించే 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాయచోటి కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించడమే 'ఆడుదాం ఆంధ్ర' లక్ష్యమని తెలిపారు. ప్రతి సచివాలయానికి రెండేసి చొప్పున కిట్లు వస్తాయని చెప్పారు. ఈ పోటీలలో పాల్గొని గెలుపొందిన వారిలో ఒకటి మహిళలు, ఒక కిట్ పురుషులకు అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని సచివాలయాలకు 501 కిట్లు అందిస్తామన్నారు. వాలీబాల్ నెట్, షటిల్ నెట్, క్రికెట్ కిట్ తదితరాలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా క్రీడా శాఖ అధికారి చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు చర్యలు

బాల్య వివాహాల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలపై జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం బాల్య వివాహాల నిరోధక చట్టం-2006 పోస్టర్లను ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ, రాయచోటి, మదనపల్లి, రాజంపేట ఆర్డీఓలు, ఎన్‌జీఓలు, సీడీపీఓలు పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖ ఆర్డీగా రత్నకుమారి



డాక్టర్ రత్నకుమారి

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ రత్నకుమారి బాధ్యతలు చేపట్టనున్నారు. ఏలూరు జిల్లా ఎయిడ్స్ లెప్రసీ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై రీజనల్ డైరెక్టర్‌గా ఇక్కడికి రానున్నారు. ప్రస్తుతం అడిషనల్ డైరెక్టర్ (ఎంసీహెచ్) డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ ఇన్‌ఛార్జ్ రీజనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ స్థానంలోకి రత్నకుమారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఐటీ ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్

వేంపల్లె: ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ క్యూట్ హైవేస్‌కు ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు తొమ్మిది మంది ఎంపికైనట్లు డైరెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. సీఎస్ఈ విభాగానికి చెందిన మహమ్మద్ రెహమాన్, డిష్ణ, హిమబిందు, చందన్, అంజలి, రేఖ, హర్షవర్ధన్‌రెడ్డి, పరశురాం, జయేష్ రంజన్, లోకేష్ ఎంపికకగా వారికి వార్షిక వేతనం రూ.6.5 లక్షలు ఇవ్వనున్నారని తెలిపారు. చాన్సలర్ కేసీ రెడ్డి, వైస్ చాన్సలర్ విజయ్ కుమార్, ఏవో రాం భూపాల్‌రెడ్డి, నాగరత్న, కిషోర్, సుందర్, రవి బాబు విద్యార్థులను అభినందించారు.

రామారెడ్డికి 'గడియారం' సాహిత్య పురస్కారం



నరాల రామారెడ్డి

కడప కల్చరల్: జిల్లాలో ప్రసిద్ధ అవధాన కవి డాక్టర్ నరాల రామారెడ్డికి మహాకవి డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి సాహిత్య పురస్కారం అందజేయనున్నట్లు రచన సాహిత్య వేదిక కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి తెలిపారు. 2020 సంవత్సరం నుంచి సాహితీవేత్తగా ఆయన అందించిన సేవలను దృష్టిలో పెట్టుకుని పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. నవంబరు 5న నిర్వహించే సభలో అవార్డు కింద రూ.10 వేల నగదు, ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు.

నష్టపోయిన పంటలకు పరిహారం

కడప అగ్రికల్చర్: జిల్లాలో 2023-24 సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్‌కు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో దిగుబడి ఆధారంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించనుంది. అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు కంది, వరి, రబీ సీజన్‌లో వేరుశనగ పంటకు పరిహారం చెల్లించనున్నారు. వైఎస్సార్ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు గ్రామ యూనిట్‌గా వరికి, జిల్లా యూనిట్‌గా కంది, జొన్న, మినుము, పసుపు పంటలకు, రబీ సీజన్‌లో గ్రామ యూనిట్‌గా శనగకు, జిల్లా యూనిట్‌గా వరి, జొన్న, మినుము, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలకు పరిహారం చెల్లించనున్నాయి. వాతావరణ పరిస్థితులకు పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో అన్నమయ్య జిల్లాకు సబంధించి ఖరీఫ్‌లో వేరుశనగ, టమోట పంటలకు రబీ సీజన్‌కు సంబంధించి ఆరటి, టమోట పంటలకు మండల యూనిట్‌గా చెల్లించనున్నారు. వైఎస్సార్ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, చీనీ పత్తి పంటలకు మండల యూనిట్‌గా, రబీ సీజన్‌లో అరటి, టమోట పంటలకు మండల యూనిట్‌గా చెల్లిస్తారు.

బాలికా విద్యకు భరోసా

బాలికా విద్యకు సర్కారు భరోసా కల్పిస్తోంది.. ఆసరా అవసరమైన వారి కోసం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను నిర్వహిస్తోంది.. చదువుతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించే కోర్సులు ప్రవేశ పెట్టింది.. దీంతో వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. బుధవారం ప్రపంచ బాలికా దినోత్సవం సందర్భంగా కేజీబీవీలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- ఆసరా అవసరమైన వారికి వరంగా కేజీబీవీలు
- 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు బోధన
- ఉపాధి, ఉద్యోగాలు కల్పించే కోర్సుల నిర్వహణ
- నేడు ప్రపంచ బాలికా దినోత్సవం

జిల్లాలో మండలాలు :	30
కేజీబీవీలు :	21
విద్య :	6 నుంచి ఇంటర్మీడియెట్



తంబళ్లపల్లె కేజీబీవీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు

మదనపల్లె సిటీ: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన ఆడపిల్లలకు, ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లే వారి బిడ్డలకు, దారిద్ర్య రేఖకు దిగువన జీవనం సాగిస్తున్న బాలికలకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు వరంగా మారాయి. ఉన్నత విద్య, ఆహ్లాదకరమైన వాతావరణం, ఆంగ్లమాధ్యమంలో బోధన, యోగా, క్రీడలు, ఇతర సదుపాయాలు కలిస్తూ వారి భద్రతకు భరోసా కల్పిస్తున్నాయి. వృత్తి విద్య వారి బతుకుదెరువుకు మార్గం చూపుతోంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 2005లో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీ బీవీలు) ఏర్పాటు చేశా రు. వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నాడు-నేడు కార్యక్రమం ద్వారా కేజీబీవీల్లో అన్ని వసతులు కల్పించారు. పదో తరగతి అనంతరం విద్య మానేయకుండా వాటిలోనే ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. అన్నమయ్య జిల్లాలో 21 కేజీబీవీలు ఉన్నాయి. వాటిలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు బోధిస్తున్నారు. ఒక్కో తరగతిలో 40 మంది విద్యార్థులు ఉంటారు. గతేడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. 2018లో కేజీబీవీల్లో ఇంటర్ తరగతులు ప్రారంభించారు. ఎంపీసీ, బైపీసీతోపాటు సీఈసీ, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు, ఐటీ, ఫుడ్‌ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, అగ్రికల్చర్, కుట్లు, అల్లికలు వంటి వృత్తి విద్యా కోర్సులు నిర్వహిస్తున్నారు. దీంతో పదో తరగతి తరువాత డ్రాపౌట్స్‌గా మారకుండా ఇంటర్ విద్య కొనసాగిస్తూ బాలికలు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

అన్ని సౌకర్యాలు

కేజీబీవీలలో పని చేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వాచ్‌మెన్లు, వంట మనుషులు అందరూ మహిళలే. ఇక్కడ చదువుతున్న బాలికలకు ఉన్నత విద్య అందించేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటరాక్టివ్ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్యాబోధన చేస్తున్నారు. నాణ్యమైన భోజనం, వసతి కల్పిస్తున్నారు. మూడు నెలలకోసారి ఆరోగ్య పరిశుభ్రత కిట్లు అందజేస్తున్నారు. బాలికా సాధికారత క్లబ్‌ల ఏర్పాటుపై వారికి అవగాహన కల్పిస్తున్నారు.

ఉజ్వల భవిత



కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలతో బాలిక విద్యకు భరోసా కలుగుతోంది. బాలికల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కేజీబీవీలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. దీంతో బాలి కలు చదువుకునే అవకాశం కలిగింది. కేజీబీవీల్లో చదివే విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి వివిధ రంగాల్లో రాణిస్తున్నారు.

-శ్రీరాం పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్తమాధవ రానికి చెందిన వివాహిత వెలిగండ్ల శిరీషను వరకట్నం కోసం వేధిస్తున్నారనే ఆరోపణలపై ఆమె భర్త, అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు....వెలిగండ్ల శిరీషకు ఓబులవారిపల్లి మండలం, కురుగుంట్ల గ్రామానికి చెందిన శివప్రసాద్ రాజుతో 6 సంవత్సరాల క్రితం వివాహమైంది. వివాహం అనంతరం భర్త శివప్రసాద్ రాజు బతుకు తెరువు నిమిత్తం కువైట్‌కు వెళ్లాడు. వీరికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. తిరిగి కొద్ది రోజుల క్రితం తన స్వగ్రామానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో తనను భర్త శివప్రసాద్ రాజు, మామ గురవరాజు, అత్త వెంకట రమణమ్మ, ఆడబిడ్డలు సుజాత, సుభాషిణి, సుగుణ, బావ శివశంకర్ రాజు వరకట్నం కోసం వేధిస్తున్నారని శిరీష మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతి చెందిన రామచంద్రయ్య

ఒంటిమిట్ట : మండల పరిధిలోని నరవకాటి పల్లి పంచాయతీలోని బోగేపల్లి గ్రామంలో చెవుల రామచంద్రయ్య(70) అనే వ్యక్తి మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. రామచంద్రయ్య తన స్వగృహంలోని సీలింగ్ ఫ్యాన్ రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి చనిపోయాడన్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి


తిమ్మారెడ్డి మృతదేహం


తిమ్మారెడ్డి (ఫైల్)

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. ఎస్టేట్‌లోని విజయనగర్ కాలనీకి చెందిన వి.తిమ్మారెడ్డి(80) భార్య తులసమ్మతో కలిసి స్థానికంగా నివసిస్తున్నారు. సాయంత్రం కూరగాయల కోసం ఇంటి నుంచి తిరుపతి ప్రధాన రహదారిపైకి రావడంతో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఆయనను ఢీకొంది. ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడగా, స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా..ద్విచక్రవాహనాన్ని ఓ మహిళ నడిపినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి కుమార్తె శశికళ ఉన్నారు.

తీరని విషాదం

- మదనపల్లె పట్టణం షాన్‌వాజ్‌వీధికి చెందిన జయంతి కుమార్తె స్నేహలత డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతోంది. రెండు సబ్జెక్టులలో ఫెయిల్ కావడంతో కాలేజీకి వెళ్లలేదు. దీంతో తల్లి చదువుకోమని ఒత్తిడి తేవడంతో ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.
- మదనపల్లె సమీపంలోని నక్కలదిన్నెకు చెందిన సుధాకర్ కుమారుడు సురేష్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీకి సరిగా వెళ్లలేదని తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు.
- కురబలకోటకు చెందిన బాలప్ప కుమారుడు చైతన్య బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు బైక్ కొనివ్వలేదని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- రామసముద్రం మండలం కాప్పల్లికి చెందిన రజని డిగ్రీ చదువుతుండగా తల్లిదండ్రులు వివాహం చేయాలని యత్నించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.
- నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన అపర్ణ ఇంటర్మీడియట్ చదువుతోంది. చదువులో వెనుకబడటంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది.

ఇవి ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు మాత్రమే. ఇలాంటి సంఘటనలు జిల్లాలో నిత్యం చోటు చేసుకుంటున్నాయి.


కలాంకు మార్కులు ఎక్కువగా వచ్చేవి కావు. కానీ చదవడం, నేర్చుకోవడం అంటే మక్కువ. అదే గొప్ప స్పేస్ శాస్త్రవేత్తను, రాష్ట్రపతిని చేసింది. భారతరత్నను తెచ్చిపెట్టింది.


సచిన్ పదో తరగతిలో ఫెయిల్ అయ్యారు. అయితే క్రికెట్ లోకానికి వన్నె తెచ్చారు. దేశానికి ప్రఖ్యాతులు తీసుకొచ్చారు.


శ్రీనివాస రామానుజన్ గొప్ప గణిత మేధావి. కొన్నిసార్లు చదువులో ఇబ్బంది పడినా ఎప్పుడూ నిరాశ చెందకుండా లెక్కల్లో కొత్త విషయాలు తెలుసుకునే వారు. అతని మేధాశక్తిని గుర్తించిన గణిత ఆచార్యులు జీహెచ్ హార్డీ ద్వారా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో పరిశోధనకు అవకాశం పొందారు.


ప్రముఖ గాయని లతా మంగేష్కర్ ఎప్పుడూ స్కూల్‌కు వెళ్లలేదు. అయినా పాటల తోటలో గాన కోకిలగా కీర్తి గడించారు.

క్షణికావేశం.. కారాదు శాపం.!

మదనపల్లె డివిజన్‌లో ఇటీవల జరిగిన ఆత్మహత్యలు	
2023 (జులై నుంచి సెప్టెంబర్ వరకు)	8
ఆత్మహత్యాయత్నాలు	16



మదనపల్లె సిటీ : విద్యాబుద్ధులు నేర్చుకుని ఉజ్వల భవితను అందుకోవాల్సిన విద్యార్థులు చిన్న సమస్యలకు కూడా మరణమే శరణం అనుకుంటున్నారు. కౌమారదశలో జీవిత గమ్యాన్ని నిర్దేశించుకోకుండా చెడు అలవాట్లకు బానిసై కొందరు, మానసిక ఒత్తిడిని తట్టుకోలేక మరికొందరు ప్రాణాలు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు కోప్పడ్డారని, అడిగింది కొనిపెట్టలేదని, చదువులో రాణించలేకపోతున్నామని మనస్తాపం చెంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుంటున్నారు. చిన్న చిన్న కారణాలకే నిండు నూరేళ్లప్రాయాన్ని రెండు పదుల వయసులోనే ముగిస్తున్నారు. నిరంతరం పిల్లల భవిష్యత్తు కోసం తపనపడే తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారు.

పిల్లలతో స్నేహంగా ఉండండి..

చాలా మంది తల్లిదండ్రులు ఉరుకులు, పరుగుల జీవితంలో కాలంతో పోటీ పడుతూ పిల్లలు ఏం చేస్తున్నారో గమనించలేకపోతున్నారు. ఆడుతూపాడుతూ చదుకోవాల్సిన దశలో మార్కులు, ర్యాంకులు అంటూ వారిని ఒత్తిడికి గురి చేస్తున్న వారూ లేకపోలేదు. కనీసం పాఠశాల నుంచి వచ్చిన తరువాత వారితో మాట్లాడేందుకు సమయం కేటాయించలేకపోతున్నారు. ఇంకొందరు పిల్లలను అతి గారాబం చేస్తున్నారు. అవసరాలు తీర్చాలనే తాపత్రయంతో అడిగినవన్నీ ఇస్తూ వారిలో ఒక రకమైన భావన పెంపొందిస్తున్నారు. కష్ట సమయంలో అవి తమకు అందడం లేదని ప్రాణాలు తీసుకునేందుకు పిల్లలు వెనుకాడటం లేదు. ఎదుగుతున్న కొద్దీ పిల్లల్లో వస్తున్న మార్పులను, ప్రవర్తనను కనుగొనలేకపోతున్నారు. సమాజంలో గుర్తింపు కోసం పిల్లలపై ఒత్తిడి తీసుకురావద్దు. వారిలో నిరాశ, నిస్పృహలను దూరం చేసేందుకు ప్రయత్నించాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. వైఫల్యాన్ని అధిగమించే విధంగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని, మానసిక ఒత్తిడిని జయించేందుకు వారితో కొంత సమయం వెచ్చించి, స్నేహంగా ఉండాలని చెబుతున్నారు.

జీవన నైపుణ్యాలు పెంపొందించాలి



చదివే పిల్లల్లో భవిష్యత్తుపై నమ్మకం లేకపోవడం, తోటి విద్యార్థులతో పోల్చి చూపడంతో వారిలో భయం మొదలయ్యే అవకాశముంది. వైఫల్యాలు తట్టుకునే విధంగా వారిలో జీవన నైపుణ్యాలను తల్లిదండ్రులు పెంపొందించి, భవిష్యత్తుపై నమ్మకాన్ని కలిగించాలి. చదువుతో పాటు వివిధ అంశాలపై ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ అవగాహన కలిగించాలి. -డాక్టర్ రాధిక, మానసిక వైద్యనిపుణులు, మదనపల్లె

కుటుంబ సభ్యులతో చర్చిస్తే పరిష్కారం



పిల్లలు దేశానికి భావి పౌరులు అంటారు. అలాంటిది చిన్నచిన్న కారణాలతో ప్రాణాల మీదకు తెచ్చుకోవడం సరైన పద్ధతి కాదు. చదువు, ఆటల్లో రాణించినప్పుడు కష్టనష్టాలను ఎదుర్కొనే సామర్థ్యం అలవడుతుంది. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కుటుంబ సభ్యులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటే పరిష్కారం లభిస్తుంది.

-కె.కేశప్ప, డీఎస్పీ, మదనపల్లె

అన్నమయ్య జిల్లా వాసికి ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సాయం


ఈశ్వర్‌నాయుడుతో వైఎస్సార్‌సీపీ కువైట్ కమిటీ నాయకులు

కడప కార్పొరేషన్ : కువైట్‌లో ఇబ్బందులు పడుతున్న అన్నమయ్య జిల్లా వాసికి ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ సాయపడింది. ఫలితంగా అతను సురక్షితంగా స్వదేశానికి చేరాడు. ఏపీఎన్‌ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజంపేట నియోజకవర్గం సిద్దవటం మండలం మిట్టపల్లె గ్రామానికి చెందిన ఈశ్వర్‌నాయుడు రెండేళ్ల కిందట కువైట్‌లో వ్యవసాయ క్షేత్రంలో సేద్య పనుల నిమిత్తం ఓ ప్రాంతానికి వెళ్లాడు. కువైటీ వేతనాలు సరిగా ఇవ్వకుండా ఎనిమిది గంటలకు బదులు 12 గంటలు పనిచేయించుకుంటూ వేధించేవాడు. దీంతో ఒకటిన్నర సంవత్సరం కింద అక్కడి నుంచి పారిపోయిన ఈశ్వర్‌నాయుడు బయట భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవితాన్ని వెళ్లదీస్తూ నెలనెల కొంతమొత్తాన్ని ఇంటికి పంపేవాడు. రెండు నెలల కిందట ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పాక్షికంగా పక్షవాతానికి గురయ్యాడు. తనకు ఆరోగ్యం సరిగా లేదని, పాస్‌పోర్టు ఇస్తే స్వదేశానికి వెళ్లిపోతానని ఎంత బతిమాలినా స్పందన లేకపోవడంతో పాస్‌పోర్టు ఇవ్వకపోగా కేసు పెట్టారు. తన తండ్రి ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని శివయ్యనాయుడు గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు నాగరాజు, గల్ఫ్ ప్రతినిధి షేక్ ఫయాజ్‌లకు తెలిపారు. దీనిపై వారు వెంటనే స్పందించి భారత రాయబార అధికారులతో మాట్లాడి కువైటీ నుంచి పాస్‌పోర్టు ఇప్పించి ఇండియాకు పంపించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌నాయుడు మాట్లాడుతూ ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ద్వారా ప్రవాసాంధ్రుల సమస్యలు పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనను సురక్షితంగా స్వగ్రామానికి పంపేందుకు సహకరించిన భారత రాయబార అధికారులు, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, ఇలియాస్, బాలిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రెడ్డెయ్యరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

రుణాలు జీవనోపాధికి వినియోగించాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

రామాపురం : డ్వాక్రా సంఘ సభ్యులు బ్యాంకులో తీసుకున్న రుణాలను జీవనోపాధికి వినియోగించుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో డ్వాక్రా ఈఓ లీడర్లు, యానిమేటర్లకు శిక్షణలో భాగంగా ఆయన మాట్లాడారు. బ్యాంకులలో అప్పులు సకాలంలో చెల్లిస్తున్న సంఘాలను ఏ గ్రేడ్ చేయాలని వెలుగు సిబ్బందికి సూచించారు. జిల్లా వ్యాప్తంగా 30,500 స్వయం సహాయక సంఘాలకు శ్రీనిధికి రూ.112 కోట్లు, బ్యాంకు రుణాలు రూ.261 కోట్లు ఇచ్చారన్నారు. మండలంలోని 727 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాల కింద 2023 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రూ.11 కోట్లు , శ్రీనిధి కింద రూ.1.10 కోట్లు, ఉన్నతి ఎస్సీ, ఎస్టీ పథకానికి రూ.60లక్షలు, సీఐఎఫ్ కింద హౌసింగ్‌లో రూ.41లక్షలు 332 మంది లబ్ధిదారులకు ఇచ్చారన్నారు. జగనన్న తోడు కింద 305 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.30.50 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం దేవసేన, సీసీలు, యానిమేటర్లు, ఈఓ లీడర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం మండలం కొత్తూరు గ్రామంలో సంగటి హోటల్ నడుపుకుంటున్న వేణుగోపాల్ ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం దొంగలు బీరువాను పగలకొట్టి అందులో ఉన్న రూ. 5లక్షలు నగదు, కొన్ని బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. బ్రహ్మంసాగర్ రోడ్డులో సంగటి హోటల్ నడుపుకుంటున్న వేణుగోపాల్ కొత్తూరు నివాసి. ఉదయం 8గంటలకు హోటల్ దగ్గరకు వేణు , ఆయన భార్య వచ్చారు. హోటల్ సమయం పూర్తి చేసుకొని సాయంత్రం ఇంటికి వెళ్లగా ఇంటి తాళాలు తీసి ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా కూడా తెరిచి ఉంది. అందులో దాచిన రూ. 5లక్షలు నగదు, కొంత బంగారు నగలు కన్పించలేదు. దీంతో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

మహిమగల కమండలం పేరుతో టోకరా

- కడప స్వామీజీ దగ్గర రూ.1.50లక్షలు వసూలు
- ఇద్దరు నిందితుల అరెస్టు


అరెస్టయిన నిందితులతో పోలీసులు


స్వాధీనం చేసుకున్న నగదు, నకిలీ కమండలం

గుర్రంకొండ : తమ పొలంలో తవ్వకాలు జరుపుతుండగా పురాతన మహిమ గల కమండలం లభించిందని నమ్మించి ఓ స్వామీజీ దగ్గర రూ.1.50లక్షలు వసూలు చేసిన సంఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 1.50లక్షలు, నకిలీ కమండలాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొన్న సంఘటన మండలకేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం దేవలచెరువు గ్రామానికి చెందిన నాగరాజు(51), రమణ(48) అనే ఇద్దరు వ్యక్తులు వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన బాల శివయోగేంద్ర స్వామీజీని కడపకు వెళ్లి కలిశారు. తమది గుర్రంకొండ పక్కన ఓ పల్లె అని అబద్ధం చెప్పి పరిచయం చేసుకొన్నారు. తాము పొలంలో తవ్వకాలు జరుపుతుండగా మహిమగల పురాతన కమండలం లభించిందన్నారు. ఆ కమండలాన్ని మీకు విక్రయిస్తామని నమ్మించారు. మహిమ కలది కనుక రూ. 10 లక్షలు ఇవ్వాల్సిందిగా స్వామీజీని కోరారు. అంత డబ్బు తనవద్దలేదని ఆయన చెప్పారు. చివరకు రూ. 2లక్షలు ఇవ్వాలని కోరగా స్వామీజీ రూ.1.50 లక్షలకు బేరం కుదుర్చుకొన్నాడు. ఈనెల 6తేదీన స్వామీజీని గుర్రంకొండ కోట వద్దకు నిందితులు పిలిపించుకున్నారు. అతని వద్ద నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేసుకున్నారు. కమండలం పక్కనే ఉందని, వెళ్లి తీసుకొస్తామని నమ్మించి ఉడాయించారు. ఎంతసేపటికి వారు రాకపోవడంతో స్వామీజీ స్థానిక పోలీసులను ఆశ్రయించారు. అప్పట్లో ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కలకడ సీఐ నాగేంద్ర పర్యవేక్షణలో ఎస్ఐ దిలీప్‌కుమార్ ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితులను మంగళవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నకిలీ కమండలం, రూ. 1.50లక్షల నగదును స్వాధీనం చేసుకొన్నట్లు వారు పేర్కొన్నారు. నిందితులను వాల్మీకిపురం కోర్టులో హాజరుపరిచినట్లు వారు తెలిపారు. కేసును నాలుగురోజుల్లో ఛేదించిన ఎస్ఐ దిలీప్‌కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సయ్యద్ ఖాసీంకు చెందిన ఇల్లు దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు.. ప్రతి రోజు ఇంట్లో కోడలు రజియా ఇద్దరు బిడ్డలతో నిద్రించేది. పిల్లలకు అనారోగ్యంగా ఉండటంతో సోమవారం రాత్రి పక్కనే ఉన్న ఇంటిలో అత్తవద్ద నిద్రపోయారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తెల్లవారుజామున మూడు గంటలకు పెద్ద ఎత్తున మంటలు చెలరేగి దట్టమైన పొగ కమ్ముకుంది. స్థానికులు గమనించి తలుపులు తెరవడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడ్డాయి. అరుపులు విని ఖాసీం సోదరులు మౌలా, ఖాదర్‌బాషా, సలీమ్ మంటలను అదుపు చేశారు. ఇంట్లో పెట్టెలో దాచుకున్న రూ.1.40 లక్షలు, పెద్ద పట్టెమంచం, రెండు బీరువాలు అందులోని విలువైన వస్తువులు, గృహోపకరణాలు పూర్తిగా కాలి బుడిదయ్యాయి. విద్యుత్ శాఖ ఏఈ కిరణ్‌కుమార్, ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, వీఆర్ఓ హరి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

సబ్ స్టేషన్‌లో షార్ట్ సర్క్యూట్

- ఎగసిపడిన మంటలు
- పరుగులు తీసిన ప్రజలు


సబ్‌స్టేషన్‌లో ఎగిసిపడుతున్న మంటలు

రామాపురం : రాయచోటి – వేంపల్లె రహదారి మార్గంలోని సూరకవాండ్లపల్లె వద్ద గల 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అకస్మాత్తుగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో సమీపంలోని ప్రజలు పరుగులు తీశారు. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ సబ్‌స్టేషన్ నుంచి రాయచోటి నియోజకవర్గం చుట్టు పక్కల గల 47 విద్యుత్ సబ్‌స్టేషన్లకు (33/11కేవి) విద్యుత్ సరఫరాను అందిస్తున్నారు. ఈ ప్రమాదంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సంఘటనపై రామాపురం ట్రాన్స్‌కో ఏఈ వరప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా సురకవాండ్లపల్లె సబ్‌స్టేషన్ నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. సబ్‌స్టేషన్‌లో ఒక్కసారిగా మంటలు రావడంతో విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు


గాయపడిన వలంటీర్‌కు చికిత్స అందిస్తున్న వైద్యాధికారులు

రామసముద్రం : ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకునికి గాయాలైన సంఘటన రామసముద్రం మండలం మాలేనత్తం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మాలేనత్తం పంచాయతీ మూగఎర్రప్పల్లికి చెందిన ఎస్.శ్రీనాథ్ (26) వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ద్విచక్రవాహనంలో వస్తుండగా ఎదురుగా అతివేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనాథ్‌కు తీవ్ర గాయాలు కాగా వెనక ఉన్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన వలంటీర్‌ను జగనన్న సురక్ష కార్యక్రమానికి తరలించారు. వెంటనే వైద్యాధికారులు లీలా, భార్గవి, తమ సిబ్బంది అత్యవసరంగా ప్రాథమిక చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 సహాయంతో పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మూడు లారీలు ఢీ

ఒకరి మృతి,
మరొకరికి తీవ్రగాయాలు


కనుమలోపల్లె వద్ద ఢీకొన్న లారీలను క్రేన్‌ల సాయంతో పక్కకు తీస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున మూడు లారీలు ఢీకొన్న ప్రమాదంలో బళ్లారికి చెందిన లారీ డ్రైవర్ లక్ష్మణ్‌నాయక్ (37) మృతి చెందగా, మరోలారీ డ్రైవర్ తమిళనాడుకు చెందిన మురుగన్ తీవ్రంగా గాయపడ్డాడని ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. నంద్యాలకు చెందిన లారీ డ్రైవర్ అన్వర్ బాషా మంగళవారం తెల్లవారుజామున కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఆగేందుకు చిన్నగా వెళుతున్నాడు. ఇదే సమయంలో స్పాంజి ఐరన్‌లోడుతో బళ్లారి నుంచి చెన్నైకి వెళుతున్న లారీ ఆగుతున్న లారీని వెనుక వైపు ఢీకొంది. ఇంతలోనే కడప వైపునుంచి వచ్చిన సిమెంటు పౌడర్ ట్యాంకర్ బళ్లారి నుంచి వచ్చిన లారీని వెనుక వైపు ఢీకొంది. దీంతో ముందున్న లారీ ముందుకు వెళ్లడంతో బళ్లారికి చెందిన లారీ రోడ్డు పక్కకు దిగి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బళ్లారికి చెందిన లారీ డ్రైవర్ లక్ష్మణ్‌నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందాడు. సిమెంటు పౌడర్‌తో చెన్నైకి వెళుతున్న లారీ డ్రైవర్ తమిళనాడుకు చెందిన మురుగన్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు రహదారికి అడ్డంగా ఉన్న వాహనాలను క్రేన్‌ల సహాయంతో పక్కకు తొలగించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరం గంజికుంటకాలనీలో నివాసం ఉంటున్న షేక్ మహమ్మద్ రఫీ (26) అనే వ్యక్తి మద్యానికి బానిసగా మారి ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహమ్మద్ రఫీకి భార్య షహనాజ్, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇతను హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యం మత్తులో ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో ట్రాక్టర్ బోల్తా

డ్రైవర్ మృతి


మృతి చెందిన శ్రీనివాసులు


ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలోని పెనగలూరు చెరువులో ట్రాక్టర్ బోల్తా పడటంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. తెగచెర్లకు చెందిన దొడ్డవరపు శ్రీనివాసులు (45) పద్మాయగారిపల్లిలో వివాహం చేసుకుని అక్కడే నివాసం ఉంటున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పెనగలూరు నుంచి ఏపీ39ఎస్‌జే9627 నంబరుగల ట్రాక్టర్‌ను తీసుకొని పద్మాయగారిపల్లికి వెళ్తుండగా పెనగలూరు చెరువుకట్ట మలుపు వద్ద ట్రాక్టర్ చెరువులోకి బోల్తాపడింది. డ్రైవర్ ట్రాక్టర్ ఇంజిన్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేటకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.